కథానిక:

క్రౌర్యం

"ఏదికావస్తూంది. ఇంకా వంటకాలేదు కదూ" అన్నాడు ప్రొఫెసర్.

కుముద భర్తవంక ఒక్కసారి కన్నెత్తి చూసి, మళ్ళీ తిరగమోత వేస్తూవుంది. వినయము, ప్రేమ ఉట్టిపడేమాటలు ఆమె నాలికకొనదాకా వచ్చినై; కాని అక్కడే ఆగిపోయినై. ప్రొఫెసర్ ముఖాన కోపం గాని, విసుగుగాని అవంతకూడా లేదు. వారు కోపంగా వున్నారనుకుంది. ప్రేమపూరిత వాక్కులు నాలికకొసదాకా వచ్చినై. కాని సర్వకాల సర్వావస్థల్లోనూ విరాజిల్లే ఆస్నిగ్ధమందహాసం యెగరగొట్టివేసింది- తుఫాను యెండుటాకుల్ని తన్నుకు పోయినట్టు. ఆమెకు మండుకుపోయింది. మళ్ళీ అదే నవ్వు!

ప్రొఫెసన్ దగ్గరికి వెళ్లి, ఆమెభుజంమీద

శ్రీ నన్నపనేని సుబ్బారావు

చెయివేశాడు. క్షణకాలం ఆమె శిరోజాల నటునిటు కదిలిచ్చాడు. కుముద ఏమీ మాట్లాడలేదు. ఆమెకు లోలోపలే రగులుకుపోతూవుంది. పతిస్పర్శ తనకింత పెగటుగా, అప్రియంగా వున్నందుకు ఆమె ఆశ్చర్యపడింది. కాని ఆమె, చేతిని తీసి వెయ్యలేదు. చైతన్యరహితమయిన శిలాప్రతిమవలె శాంతంగా వుండటానికి ప్రయత్నించింది. ఒకసారి భర్తవంక తిరిగి జవాబిద్దామనుకుని మళ్లీ వూరుకుంది. వారి ముఖంమీద ఎప్పటిమాదిరిచిరునవ్వే ప్రత్యక్షమవుతుందేమో; కుముదకి ఆ చిరునవ్వు చూస్తే తగని చిరాకు! ఎందుకంటే ఆచిరునవ్వు ముందు ఆమె నిరుత్తరురాలు, వివశురాలయేది. వివశత్వంతో, చిరాకుతో, విచిత్రమయిన వ్యథతో నిండిపోయి, హఠాత్తుగా ఆమెకు కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినై. అప్పుడే ప్రొఫెసర్ ఆమెముఖం తన వంక తిప్పుకున్నాడు. ఆమె నేత్రాల్లోని కన్నీరు చూసి, అవి పశ్చాత్తాపమువల్ల కలిగిన అశ్రువులని భావించి, ప్రొఫెసరుమనసు కరిగిపోయింది. "ఛీ, నువ్వా బేలదానివి? ఎందుకు? నేనేమీ అనలేదే! నాకేమీ కష్టమనిపించలేదే!" అన్నాడు ప్రొఫెసర్.

ఒక్కొక్కశబ్దం వొక్కొక్క బాణంలాగా ఆమెహృదయాన్ని చీల్చుకుపోతూ వుంది; వివశత్వము, చిరాకుతో కూడిన వ్యథనుకూడా యినుమడింప చేస్తూ వుంది. 'నేనేమీ అనలేదే!' ఏమీ అనకపోవటమేగా యీ వేదనకు హేతువు! 'నాకేమీ కష్టమనిపించలేదే!' ఇదేగా దుఃఖానికి మూలం! మన మనసులో యిలాంటి విషయాలు కల్పనారూపంలో కాక, అనుభూతిలో ఉత్పాతంవలె వస్తవి. సాధారణంగా మనం వీటిని అర్థం చేసుకోలేం. లేక అర్థంచేసుకోవటానికి యిష్టపడం!

చివరికి కుముద పట్టలేక, ముఖంచటాలున తిప్పుకుని, నిర్దాక్షిణ్యంగా ప్రొఫెసరుచేతిని విదిలించివేసింది.

ప్రొఫెసర్ నిశ్చేష్టుడయాడు. భార్య కఠోరత యిప్పటికి బోధపడింది. చాలా క్షుబ్ధుడయాడు; కాని అంతకంటె యెక్కువ ఆశ్చర్యపోయాడు. ఏంచేశాడు? చాలా బాధపడ్డాడు. ఉన్నత విద్య అతనికి మనోవికారాల్ని నిగ్రహించుకునే శక్తిని ప్రసాదించింది. అయినా పురుషుడు! మనస్సు విచలితమై, గంభీరస్వరంతో "కుముదా!" అన్నాడు.

కుముద ఆక్రోశం పట్టలేక, విసవిస మంటూ, భర్తవంక కన్నెత్తి చూడకుండానే వెళ్లిపోయింది.

ప్రొఫెసర్ హతబుద్ధియై కాసేపు నిశ్చలంగా అక్కడే నిలబడిపోయాడు. తర్వాత కోపంతో కంపించిపోయాడు. పాలపొంగులాగా ముక్కోపులకు కోపంరావటమూ తొందరే, చల్లారటమూ తొందరే! కాని కొంతమందికి ఎప్పుడోగాని కోపం రాదు; వచ్చినప్పుడు మాత్రం వెంటనే చల్లారదు. మనిషే మరుమూరైపోతాడు.

ప్రొఫెసర్ యెంగిలిపడకుండానే కాలేజికి వెళ్లిపోయాడు. కుముదకూడా అలానే పోయి పడుకుంది. పొయ్యిమీద కూర మాడి, మసైపోయింది. కాసేపటికి పొయ్యి కూడా ఆరిపోయింది.

ప్రొఫెసర్ ఇవాళ కోపంతో—స్వభావానికి వ్యతిరేకంగా—కాలేజికి వెళ్లాడని కుముదకి సరిగ్గా తెలియలేదు. వేళకి వంట కాకపోతే, భోజనం చేయకుండానే కాలేజీకి చాలాసార్లు వెళ్లాడు. కాని ఎన్నడూ కోపం అనేది ఎరగడు.

ఆమె చాలాసేపు పడుకుని ఆలోచిస్తూ వుంది. కాని తను ఏమి ఆలోచిస్తోందో ఆమెకే సరిగ్గా తెలీదు. ఆమెకి హృదయవేదన క్రమంగా దుర్భరమవుతుంది. అందువల్ల వూపిరి పీల్చుకోటం కూడా కష్టంగా వుంది. ఎంతోసేపు వెక్కి వెక్కి ఏడ్చింది. తలగడ తడిసి ముద్దయిపోయింది. వర్షం కురిసినాక వుమ్మరింప తగ్గినట్టు, మబ్బులు విడిపోయినట్టు, ఏడ్చినపిమ్మట ఆమెకు కొంత తేలికైన మాదిరిగా వుంది.

ఆమె మనసు కలకతేరింది. గతజీవితంలోని కొన్ని ఘట్టాలు వరసతేరి చిత్రాల మాదిరిగా మనోవీధిని తిరుగాడుతున్నాయి. పెళ్లికి పూర్వపుచిత్రాలు కొన్ని ప్రత్యక్షమయినై. ఆ రోజుల్లో తను ఏమికలలు కంటూవుండేవో, గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తూవుంది. తనకి గుర్తున్నంతవరకు ఆ రోజుల్లో ప్రత్యేకంగా దేన్ని గురించీ ఆలోచించేది కాదు. ఎప్పుడూ కేరింతలు కొడుతూ పొద్దు పుచ్చేది.

తిన్నగా రోడ్డుమీద నడిచేది కాదు. స్ప్రింగ్ లాగా ఎగురుతూ పోయేది. అప్పుడప్పుడు ఆమెకి చిత్రమైన ఆలోచనలు కలిగేవి. "ముందు ముందు ఏమి జరుగుతుందో! ఎలావుంటుందో!" ఆ సమయంలో కుతూహలం, భయసందేహాలు ముప్పిరిగొనేవి!

తర్వాత పెళ్లిఅయింది. పెళ్లి అయి ఇప్పటికి నాలుగేళ్లయింది. ప్రథమవసంతం సుఖంగా గడిచిపోయింది; ఆమె కోరిన సమస్తమూ భర్తవద్ద ఆమెకు ప్రాప్తమయింది. అందులో నిమగ్నమై తన అదృష్టాన్ని కొనియాడుతూ వుండేది. రెండో సంవత్సరం తనకి భర్తవల్ల లభించవలసింది చాలా వున్నట్టు మెల్లిగా బోధపడుతూవచ్చింది. భర్తలో ఏదో లోటు వుందని ఆమెకి తోచేది. రోజులు గడిచిన కొద్దీ ఈలోటు భరించటం దుర్భరంగా కనిపించసాగింది. కాని ఆలోటు ఏమిటో నేటికీ ఆమెకి సరిగా అర్థంకాలేదు. ఇవాళ తానెందుకు ఇలా యేడ్చిందో యెంత ఆలోచించినా జవాబు రాలేదు. అందువల్లనే యీ వేదన మరీ దుస్సహమైపోయింది.

హఠాత్తుగా ఆమెకి భర్తముఖం గుర్తుకొచ్చింది. పెదవులమీది మందహాసం తలపుకొచ్చి, కుముద అగ్నిహోత్రమయింది. తనవల్ల ఎంత పెద్ద పొరపాటు జరిగినా, కోపం రావటానికి ఎటువంటి అవకాశాన్ని కల్పించినా, అతని ముఖంలో ఎప్పుడూ ఆ చిరునవ్వే ప్రత్యక్షమయ్యేది. ఆ నవ్వుముందు ఆమె బాణాలన్నీ గురితాకకుండా పోయేవి. అదొక దుర్భేద్యమయిన కవచంలాగా వుంది; దాన్ని ఛేదించుకుని ఆమె భర్తవద్దకి చేరలేక పోతూంది. అదీగాక ఆమె అర్ధాంగి, అతని సంపూర్ణ అస్తిత్వంలో పాలు పంచుకోటానికి ఆమెకి హక్కుంది. భర్తవ్యక్తిత్వాన్ని సగ్గరూపంలో తనదిగా చేసుకోవాలనుకుంటుంది. కాని తనవల్ల యేలోటు జరిగినా, ఆమందహాసంమాత్రం చలించేది కాదు. పెద్దలు పిన్నల తప్పుల్ని మన్నించాలనే భావం దానిలో వున్నట్టుంది. కుముద దీన్ని గ్రహించి మరీ మండిపడేది. అసలు ఆయనకి ఎందుకు కోపం రాదు? ఎందుకు విసుక్కోడు? యోచించిన మీదట, విషయాసు ప్రేమవల్ల లభించే మన్ననలో అభ్యంతరం వుండవచ్చు. కాని, వ్యతిహాసంగా స్నేహబాంధవంలో యెక్కువసించి వుంది? కుముదకి ఈ రకమైన మన్నింపు అంటేనే శత్రుభావం ఏర్పడింది. కొంతమందికి పిల్లలతప్పులమీద ముద్దువస్తుంది. కాని, వీరికి తలుచుకుంటేనే తలప్రకోపిస్తుంది. ఒక్కొక్కసారి కోపంవచ్చి, చాలా కఠోరంగా మాట్లాడేది. కాని యెందుకొట్టై వెన్నెల వస్తే, మెత్తబడినట్టు, అస్నిగ్ధహాసంముందు ఆమె ఉడుకుపోతులాగ అయ్యేది. కరుకుతనం. స్నిగ్ధతకు కరుకుతనాన్ని కొక్కించలేదు కాని, స్నిగ్ధత కరుకుతనాన్ని పోగొట్టగలదు. ఇంక చేసేదిలేక, తన అసమర్థతకి, పరాజయానికి కుమిలిపోయేది; తర్వాత పెగటుతో ఆమె మనసు తిక్కమైపోయేది. చివరికి అమోఘమైన రామబాణం — ఏకాంతంగా కూచుని ఏడవటం — ఆమెకి మనశ్శాంతిని ప్రసాదించేది!

కుముద కాలేజీలో చదువుకోటంవల్ల, తరచుగా తన మనోభావాల్ని వ్యాఖ్యానించుకుంటూ వుండేది. ప్రతిసారి ఒకే నిర్ణయానికి వచ్చేది. తను ప్రసన్నురాలు కావటానికి, అసంతుష్టి చెందటానికి, తగినకారణం ఏమీ లేదు! కాని తర్కంతో ఆమె హృదయం తృప్తిపడేది కాదు. కాలేజిలో చదివినప్పుడు చెలికత్తెల మనస్తత్త్వం బాగా గుర్తుంది. వారు తనస్థానంలోవుంటే, చాలా సంతుష్టి చెందేవాళ్లని ఆమె తరచు అనుకుంటూవుండేది. ఒక కవినో, రచయితనో పెళ్లాడవచ్చని అంతస్సు వేగిరకోలం చేసేది. ఆయనలో రచయితకుండవలసిన లక్షణాలన్నీ వుంటని. ఆయన గుడ్డలు మాసినా, గడ్డం పెరిగినా తనకి కాదులే అన్నట్టుంటారు; భార్య పరిహాసమాడుతుంది. వస్తువులు ఎక్కడపడితే అక్కడ పారవేస్తే, ఆమె వాటిని సర్దుతుంది; వారికి కోపంవచ్చి పలకరించటం మానివేస్తే, బతిమాలుకుంటుంది. వారు రావటం ఆలస్యమయితే, భోజనముందు పెట్టుకని వారికోసం ఎదురు చూస్తూవుంటుంది; కోపంవచ్చి వెగ్గ సాట్లాడితే, భయంతో వణికిస్తుంది. యెంతసేపువాళ్లు లేకపోతే, బల్లమీద పుస్తకాలు చిందరవందరై, దుమ్ముకొట్టుకున్నట్టు, కుముదమనస్సులోని (చెలికత్తెలని యెగతాళి చేసిన యీ సంకల్పాలు ఒక క్రమం లేకుండా చెదరిపోయి వున్నవి; వాటినుంచి సత్వం పోయి, గుర్తుపట్టరానంతగా మారిపోయినై.) కుముద ప్రసన్నురాలు చేయటానికి కాలసంబంధం వుంది కాని ... కాదు. కుముద

(38-వ పేజీ చూడుము)



క్రోధం

(15 వ పేజీ తరువాయి)

వూహించుకున్న పురుషునిలో గుణదోషాలు, వాయువు, ధూళి, స్థూలసూక్ష్మభావాలు, అన్నీ మిళితమై వున్నవి. వారిలో యీ స్థూల రూపం, ధూళి లేదు! సాధారణంగా మన యిష్టులు, బంధువులయిన వారి స్థూల స్వరూపం మీదికే మనదృష్టి పోతుంది. అది చూసినప్పుడు ప్రేమ, సూక్ష్మరూపం చూసినప్పుడు శ్రద్ధకలుగుతవి. ప్రొఫెసర్‌లో ఈస్థూలస్వరూపం బొత్తిగా కనిపించదు. షడ్రసోపేతమైన భోజనం ఎప్పుడైనా ఒక సారి లభిస్తేనే రుచికరంగా వుంటుంది; నిత్యాహారం సాదాగా వుంటేనే బాగుంటుంది. భర్తకూడా నిత్యాహారంవంటి వాడే!

భర్త తనను క్షమించి, కుసుమకోమల మయినతన హృదయాన్ని నిర్దయగా కాలరాసినఘట్టాలు ఎన్నో జరిగిపోయినై. ఎప్పటి మాదిరే సాయంత్రంకూడా నవ్వుకుంటూ వస్తాడని ఆమెకి నమ్మకం ఏర్పడిపోయింది. ఆదృశ్యం తలపు కొచ్చి, ఆమెకవొంటి మీద జెర్రులు పాకినట్టయింది. "ఆయన ఎంత నిర్దయుడు, నేను కన్నీగమున్నీరుగా యేడ్చినా లెక్కచేయడు" అని మనసులో అనుకుంది.

మధ్యాహ్నం ఇలాగే గడిచిపోయింది. నాలుగ్గంటలయింది. భర్త వచ్చే వేళ అవుతూ వుంది. అలానే నవ్వుకుంటూ వస్తాడని అనుకోగానే ఆమె మండిపోతూవుంది. ఎప్పటి మాదిరే వస్తారు, దానికి భిన్నమేముంటుంది? ఆమెమనస్సుకి వెగటు కలిగింది.

అయిదుగంటలయింది. ఇంకా రాలేదు. కుముద కొంచెం వులికిపడింది. ఎందువల్ల రాలేదు? ఎన్నడూ ఆలస్యం చేయరు. నాల్గింటికల్లావచ్చేసేవారు. అదీగాక యివాళ సోమవారం. సోమవారంనాడు మూడింటికే వచ్చేవారు. మరుక్షణమే 'నవ్వుకుంటూ వస్తూండవచ్చుని అనుకుని, మళ్లీ ఆమె మండిపడింది. వారు రావటంలో ఆలస్యం కావటంవల్ల, మనస్సులో కలుగుతున్న కోమలత్వము, మధురవుదాసీనత మాయమై మళ్లీ ఆమె మనస్సు సుళ్లు తిరిగిపోయింది.

ఆరుగంటలయింది, ఏడయింది. చలికాలం. సాయంకాలం చాలా దీర్ఘంగా, భారంగా గడిచింది. చీకటిపడింది. భర్త ఇంకా రాలేదు. కుముద వసారాలో ఎదురు చూస్తూవుంది. ఉండివుండి ఆమె వ్యాకుల పడుతూవుంది. వారికి కోపం వచ్చిందని కుముదకి తెలియదు. ఆమె విసవిసమంటూ, వారిని విడిచి వంటింట్లోకి పోవడం వలన వారికి కోపం వచ్చిందని తెలుసుకోలేక పోయింది. ఒకవేళ వారికి కోపం వచ్చిందేమోననే సందేహంకూడా కలిగింది. దీన్ని ఆధారం చేసుకునే ఆమె లోలోపల ఆనంద పడుతూవుంది. సందేహం గట్టిపడినకొద్దీ, ఇంకా ఆనందపడుతూవుంది. ఒకవంక వ్యాకులత, మరోవంక ఉల్లాసం. ఆమె మనస్థితి చాలా విచిత్రంగా వుంది. లంకంత యింట్లో వొంటరిగా కూచోటానికి భయం కూడా కలుగుతూంది. ఆ సుకుమార హృదయం భయసందేహాలతో, వుల్లాసంతో వూగి పోతూవుంది. తనకి అప్తుడయిన వ్యక్తి కోపం గావున్నందుకు, అమృతరసాన్ని గ్రోలుతూ వుంది. వొంటరిపాటు, భయము ఎక్కువయి నప్పుడు, పొరుగింటి గృహిణిని పిలుద్దామను కొనేది. కాని పిలిచేదికాదు. మనస్సును వివిధభావాలు అల్లకల్లోలం చేసేటప్పుడు, బాహ్యజగత్తు ఒకవిధంగా తన మహాత్త్వాన్ని కోల్పోతుంది. పొరుగింటావిడని పిలుచుకు రావటం బాహ్యజగత్తుకు సంబంధించిన క్రియ! వారికి కోపం వచ్చిందని ఆమె కిప్పుడు గట్టిగా నమ్మకం కలిగింది. వారిని ఎలా బతిమాలుదామా అని మనసులో వూహించుకుంటూ వుంది. ఇవాళ నారీహృదయంలోని ఒకగొప్పవాంఛ సఫలంకాబోతూ వుంది. నేడు వారి పాదాలమీదవాలి సంపూర్ణంగా ఆత్మసమర్పణ చేయాలని అనుకుంది.

ఆలస్యమయినకొద్దీ, ఆమె భావాలు తీవ్రతర మవుతున్నాయి. ఊరికే ఆమె నేత్రాలు కన్నీటితో నిండిపోయినవి. అయినా హృదయాంతరాళంలో ఉల్లాసాన్నే పొందుతూ వుంది.

ఎనిమిదయింది. ఇంతవరకు ఐపులేదు. ఆమె మనోభావాలు తీవ్రత్వాన్ని అందుకున్నవి. వారు కోపంగా వున్నారని నమ్మకం కలిగి, ఆమె ఆనందంలో మునిగి తేలుతూ వుంది. హృదయాంతరాళంలో పొంగిపొరుతున్న ఈ ఆనందం క్రమంగా ఆమె మనస్సును ప్రశాంతపరిచింది. చంచలత లేదు. అనుభూతి తీవ్రస్థితినిపొందినప్పుడు, దానిలో ఒక విధమగు కమ్మని బాధ, వేదన నిండివుంటుంది. కుముదమనస్సు పరస్పరవ్యతిరేక భావాలతో ఎంతచంచలంగా వుందో, ఆమె వదనం అంత ప్రశాంతంగా వుంది. అప్పటి ఆమె మనోగతిని సరిగా వర్ణించటం సరస్వతికి కూడా అలవికాదు. ఆమె యిప్పుడు బాహ్యజగత్తులో కాదు, మనోజగత్తులో వూపిరి పీలుస్తూవుంది. చలిగాలికి నిలువెల్లా కంపించినా, అక్కడనించి లేవలేదు. చీర సరిగా సర్దుకుని కూచుంది.

ఇంతలో భర్త వచ్చాడు. తరంగాలు ఏ విధంగా వొడ్డుని తాకి, ఆత్మార్పణ చేస్తవో, అదేవిధంగా కుముద "క్షమించండి" అంటూ వారి పాదాలమీద వ్రాలింది. ప్రొఫెసర్ లేవదీద్దామని వంగితే, కుముద మూర్ఛిల్లి వుంది.

[శ్రీ సతీశకుమార్ బెంగాలీకథకు అనువాదం]